నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 29 జూన్ 2024 | KHAMMAM


# కేసీఆర్ ఉక్కు సంకల్పంతోనే సాధ్యమైంది..

## 'సీతారామ' సక్సెస్‌పై మాజీ ఎంపీ నామా హర్షం



ఖమ్మం, జూన్ 28 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉక్కు సంకల్పం, అవిరళ కృషితోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల జల సంకల్పం నెరవేరిందని, సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతమైందని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని లక్షలాది ఎకరాల భూములు ప్రాజెక్టు నీటితో సస్యశ్యామలమవుతాయని, ఏళ్లనాటి అన్నదాతల కల సాకారం అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రాజెక్టు నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పూర్తి చేశారని, కరువును పారదోలే కల్పతరువుగా ప్రాజెక్టును నిర్మించారని, ఈ ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. మొదటి దశ పంపుహౌస్ ద్వారా గోదావరి జలాలు ఊరూరా పరుగులు తీస్తూ లక్షలాది ఎకరాలకు చేరుతాయన్నారు. దీనిని జిల్లా రైతాంగానికి అంకితం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బందిని కూడా అభినందిస్తున్నట్లు నామా తెలిపారు.



సీతారామ ప్రాజెక్టు వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ శ్రేణులు

# నవయుగ కాటన్.. కేసీఆర్

- సర్ ఆర్థర్ తరువాత అంతటి ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రిదే..
- ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకే గోదావరిపై 'సీతారామ' నిర్మించారు
- ప్రాజెక్టుపై నాడు గగ్గోలు పెట్టిన కాంగ్రెస్.. నేడు గొప్పలు పోవడం సిగ్గుచేటు
- నాటి కేసీఆర్ కష్టానికి నేటి మంత్రుల కలరింగ్ విడ్డూరం: రేగా కాంతారావు
- సీతారామ పంప్‌హౌస్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి బీఆర్ఎస్ శ్రేణుల క్షీరాభిషేకం

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : నవయుగ సర్ ఆర్థర్ కాటన్‌గా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కీర్తి గడించారని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. గోదావరి నదిపై ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మించిన స్వరాష్ట్ర ఉద్యమ సారథి.. సర్ ఆర్థర్ తరువాత అంతటి ఘనతను సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు. నాడు కేసీఆర్ కష్టపడి చెమటోడ్చితే.. నేడు ట్రయల్ రన్ పేర్లతో కాంగ్రెస్ మంత్రులు చంకలు గుద్దుకుంటున్నారని అన్నారు. ఇప్పుడు ట్రయల్ రన్స్ కాంగ్రెస్ మంత్రులు వేసినప్పటికీ.. ప్రాజెక్టు నిర్మాణ ఘనత మాత్రం ముమ్మాటికీ కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. స్వరాష్ట్రాన్ని సాధించిన తొలినాళ్లలో ఈ ప్రాంతంలో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆశీస్సులతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి నదిపై ఇక్కడ సీతారామ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇన్నాళ్ల ఆయన శ్రమకు ఫలితంగా ఇటీవలే ఆ ప్రాజెక్టు పూర్తయిందని అన్నారు. కానీ.. ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మూడు రోజుల క్రితం తన ముగ్గురు మంత్రులను పంపి సీతారామ ప్రాజెక్టుకు ట్రయల్ రన్ వేయించిందని గుర్తు చేశారు. నాడు ఇదే ప్రాజెక్టుపై అనేక విధాలుగా గగ్గోలు పెట్టిన అప్పటి కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఈ ప్రాజెక్టు ఘనత తమదేనంటూ గొప్పలు పోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మూడు రోజుల క్రితం మంత్రులు వచ్చి సీతారామ ప్రాజెక్టుకు ట్రయల్ రన్ వేసిన నేపథ్యంలో శుక్రవారం ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ శ్రేణులు సందర్శించాయి. ఈ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా ఇక్కడికి చేరుకున్నారు. గురువారం ట్రయల్ రన్ విజయవంతమైన నేపథ్యంలో ఈ ప్రాజెక్టు పంప్‌హౌస్ వద్ద ప్రాజెక్టు నిర్మించిన కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకే గోదావరిపై ఇక్కడ సీతారామ ప్రాజెక్టును తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో గోదావరిపై సాగునీటి ప్రాజెక్టు నిర్మించిన ఘనత సర్ ఆర్థర్ కాటన్ తరువాత కేసీఆర్‌కే దక్కిందని స్పష్టం చేశారు. కానీ.. ఈ ప్రాజెక్టు నిర్మాణ ఘనత తమదేనంటూ కాంగ్రెస్ మంత్రులు ప్రచారం చేసుకుంటుండడం సిగ్గుచేటని విమర్శించారు. అలాగే, ఇదే అశ్వాపురం మండలంలో మొర్రేడుపాడు చెరువు అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్ రూ.400 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కొత్త ప్రభుత్వం ఆ చెరువు పనులను ఎక్కడివక్కడే నిలిపివేసిందని విమర్శించారు.


సీతారామ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న పినపాక నియోజకవర్గ రైతులు, బీఆర్ఎస్ నాయకులు

### ముందుగా భద్రాద్రి జిల్లాకే నీళ్లివ్వాలి..

సీతారామ ప్రాజెక్టు నుంచి ముందుగా భద్రాద్రి జిల్లాకే సాగునీళ్లు ఇవ్వాలని రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు జలాలను ఈ ఏడాదే ఖమ్మం జిల్లాకు తీసుకెళ్తామంటూ ఇటీవలి ట్రయల్ రన్ ప్రారంభంలో మంత్రులు ప్రకటిస్తుండడం అభ్యంతరకరమని అన్నారు. ఈ జిల్లాకు సాగునీళ్లు లేకుండా చేస్తే రైతులతో కలిసి అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో రూపాయి పని కూడా చేయని ఇప్పటి మంత్రులు.. ఇక్కడి నీళ్లను తరలించుకు వెళ్లేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఉద్యమ నాయకుడు దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ముంతపురి రాజుగౌడ్, సూదిరెడ్డి సులక్షణ, లక్కినేని సురేందర్, కోడి అమరేందర్, పోశం నరసింహారావు, కొల్లు మల్లారెడ్డి, వట్టం రాంబాబు, కందుల కృష్ణార్జున్, వెన్న అశోక్‌కుమార్, మేడవరపు సుధీర్, ఈదర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు ఘనత కేసీఆర్‌దే..

- భక్తరామదాసు, సీతారామకు నిధులిచ్చి పూర్తిచేసింది గత ప్రభుత్వమే..
- బీఆర్ఎస్ అభివృద్ధిని తమ గొప్పగా చెప్పకుంటున్న మంత్రులు
- కాంగ్రెస్.. ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదు
- ఖమ్మం మున్నేరు పనులను ఎల్ అండ్ టీ నుంచి తప్పించిందెవరు?
- ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, జూన్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 'సీతారామ' ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని, అయితే తమ ప్రభుత్వంలో ఆ ప్రాజెక్టును నిర్మించినట్లు కాంగ్రెస్ జిల్లా మంత్రులు చెప్పుకోవడం సిగ్గుచేటని ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని పార్టీ కార్యాలయం(తెలంగాణభవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలైనా కాకముందే ప్రాజెక్టును పూర్తిచేసినట్లు జిల్లా మంత్రులు ఫోజులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు నిధులిచ్చి పనులను పూర్తి చేయించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను యాభై ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఖమ్మంజిల్లాలో ఒక్క ప్రాజెక్టునైనా నిర్మించిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మంజిల్లాలో కేవలం తొమ్మిదినెలల్లోనే 'భక్తరామదాసు' ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి పాలేరు నియోజకవర్గంలోని 72వేల ఎకరాలకు సాగునీరు అందించిన విషయాన్ని జిల్లా రైతులు ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కోట్ల రూపాయలను కేటాయించి 'సీతారామ'కు 2017లో శంకుస్థాపన చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. రూ.13 వేల కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టు పనులు ఎవరి హయాంలో కట్టారో భట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి కావడానికి కృషిచేసిన జిల్లా ప్రజాప్రతినిధులు, ఇంజినీర్లు, సహకరించిన ప్రజలకు బీఆర్ఎస్ జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో రూ.1000 కోట్ల అవినీతి జరిగిందని చెప్పిన మంత్రులు ఈ రోజున ప్రాజెక్టు ట్రయల్ రన్ ముందు గొప్పలు చెబుతున్నారని అన్నారు. సీతారామ, భక్తరామదాసు ద్వారా ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఖమ్మం నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు మున్నేరు నదికి ఇరువైపుల వాల్‌ను నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.600 కోట్లను కేటాయించి ఎల్అండ్‌టీ కంపెనీకి పనులు అప్పగిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ కాంట్రాక్టును రద్దు చేసి కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అనుచరులైన పటేల్ కంపెనీకి అప్పగించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని మధు ప్రశ్నించారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని జోక్యం చేసుకోవద్దని ఆ పార్టీ అధిష్టానం ఆదేశించింది నిజంకాదా అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయ చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసేందుకే రోజుకొక కొత్త విషయాన్ని తెరపైకి తీసుకొస్తున్నదని విమర్శించారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తప్ప రైతులకు రుణమాఫీ, రైతుబంధు, పింఛన్ల పెంపు లాంటి హామీలను అమలు చేయలేక పోతున్నదన్నారు. కేసీఆర్ గత పదేండ్ల కాలంలో అమలుచేసిన ఏ ఒక్క పథకాన్ని కూడా కొనసాగించలేకపోతున్నారని అన్నారు. రైతుబంధు పేరు మార్చి రైతుభరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తానన్న రేవంత్ ఇప్పటివరకు రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలలో ఒక్క డీఏను కూడా ఇవ్వలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు పూర్తి చేసి, ఇంటర్వ్యూలు పూర్తి చేస్తే వారందరికీ తామే ఉద్యోగాలు ఇచ్చినట్లు వారితో మీటింగ్‌లు పెట్టడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. తెలంగాణ ప్రజలకు సేవ చేయడంలో కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి లేదని, బీఆర్ఎస్ మాత్రమే అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, తెలంగాణ ఉద్యమకారులు బిచ్చాల తిరుమలరావు, ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రాంమ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, సతీష్, మైనార్టీ సంఘం అధ్యక్షుడు తాజుద్దీన్, బీఆర్ఎస్ ఖమ్మంరూరల్ అధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

# దీర్ఘకాలిక ఆదాయం ఇచ్చే పంట ఆయిల్‌పాం

- 10 లక్షల ఎకరాల్లో సాగును విస్తరించాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 'పేట' పామాయిల్ ఫ్యాక్టరీ సందర్శన


పవర్ ప్లాంట్ పనులపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేట, జూన్ 28 : రైతులకు దీర్ఘకాలికంగా నికర ఆదాయం ఇచ్చే పంట ఆయిల్‌పాం సాగు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగును వచ్చే ఐదేళ్లలో ఆయిల్‌ఫెడ్ 5 లక్షల ఎకరాల్లో విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నదని, కానీ.. 10 లక్షల ఎకరాల్లో సాగును విస్తరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీని శుక్రవారం సందర్శించిన మంత్రి తుమ్మల.. నిర్మాణంలో ఉన్న పవర్ ప్లాంట్ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 15వ తేదీలోగా పవర్ ప్లాంట్‌ను ప్రారంభించాలని చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఆయిల్ వినియోగం 100 మెట్రిక్ టన్నులు కాగా.. కేవలం 3.96 మెట్రిక్ టన్నుల క్రూడాయిల్‌ను మాత్రమే ఉత్పత్తి చేసుకుంటున్నామని, ఇంకా 97 శాతం క్రూడాయిల్ ఉత్పత్తికి అనుగుణంగా ఆయిల్‌పాం సాగు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా 11 లక్షల ఎకరాల్లోనే ఆయిల్‌పాం సాగవుతుందని, ఏపీలో 5 లక్షలు, తెలంగాణలో 2 లక్షల ఎకరాల్లో పంట సాగవుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా మిగతా 30 జిల్లాల్లో సాగుకు భూములు అనుకూలంగా ఉన్నాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆయిల్‌పాం హబ్‌గా ఉండేలా విస్తరణ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా అంతర పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, గతంలో కోకో ధర రూ.200 ఉంటే.. ఇప్పుడు రూ.1000 దాటిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల రాయితీలు రైతులకు అందించేలా దృష్టి సారిస్తున్నామని, అవసరమైతే ఏపీ ఉద్యాన, వ్యవసాయ శాఖలను సమన్వయం చేసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొన్నారు. కాగా.. ఏపీ జనసేన నేత కరాటం రాంబాబు పూర్వ పరిచయంతో మంత్రి తుమ్మలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, ఆయిల్‌ఫెడ్ జీఎం టి.సుధాకర్‌రెడ్డి, పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఆలపాటి రామచంద్రప్రసాద్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లు రమణ, సూర్యనారాయణ, ఆయిల్‌ఫెడ్ మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, భారతి, ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కల్యాణ్ తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**


ఏజెన్సీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, జూన్ 28 : ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, సీజన్లవారీగా పండ్లు సరఫరా చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు, జీసీసీ డీఎం దావీదు, జిల్లా పర్చేజ్ కమిటీ సభ్యులు, ఏజెన్సీల యజమానుల సమక్షంలో నిర్వహించిన టెండర్ ప్రక్రియలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖమ్మం జిల్లాలోని 19 గురుకుల పాఠశాలల్లో, 8 ఈఎంఆర్‌ఎస్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. కోడిగుడ్లు, అరటి పండ్లతోపాటు సీజనల్‌గా లభించే పండ్లు, కూరగాయలు, స్కిన్ లెస్ చికెన్ నాణ్యతతో కూడినది సరఫరా చేసేందుకు 114 మంది ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేస్తే.. అందరికంటే తక్కువ కోట్ చేసిన వారికి వస్తువుల సరఫరా బాధ్యతను అప్పగించామన్నారు. ఏజెన్సీదారులు సరఫరా చేస్తున్న సరుకులు వచ్చిన ప్రతిసారి వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఏమాత్రం నాసిరకంగా ఉన్నా తనకు తెలపాలన్నారు. అన్ని పాఠశాలలను తనిఖీ చేస్తానని, ఆ సమయంలో నాసిరకం వస్తువులు సరఫరా అయినట్లు తన దృష్టికి వస్తే ఏజెన్సీదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గురుకుల పర్యవేక్షకులు కృష్ణార్జున, ఏవో నరేందర్, మహిళా డిగ్రీ కళాశాల ఏవో ప్రమీల, గురుకులం, ఈఎంఆర్‌ఎస్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, గురుకుల సిబ్బంది వరలక్ష్మి, చంటి, గణేశ్, శ్రీనివాస్, లిఖిత్, ఏజెన్సీదారులు పాల్గొన్నారు.

# బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలి


పాల్వంచలో మానవహారం చేస్తున్న దృశ్యం

పాల్వంచ, జూన్ 28 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నటరాజ్ సెంటర్‌లో పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు బొగ్గు బ్లాకులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. కోలిండియా, సింగరేణి సంస్థకు బొగ్గు గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 9 రౌండ్లలో 107 బ్లాకులను వేలం వేసిందని తెలిపారు. గత ఎన్నికల్లో బీజేపీకి చావు తప్పి కన్నులొట్టపడ్డా బుద్ధిరాలేదని విమర్శించారు. బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సత్తుపల్లి, కోయగూడెం ఓసీ 3 బ్లాకులని వేలం వేశారని, ఆ వేలాన్ని రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కిషన్‌రెడ్డి బొగ్గుగనుల శాఖ మంత్రి కాగానే దేశంలో 67 బొగ్గు బ్లాకులను రాష్ట్రంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలానికి పెట్టడాన్ని తీవ్రంగా నిరసించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, మాయమాటలు చెప్పిన బీజేపీ అధికారంలోకి రాగానే మళ్లీ దేశ ప్రజల సంపదను కొల్లగొట్టే పనిచేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, కొలగాని బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, దొడ్డా రవికుమార్, భూక్యా రమేశ్, కొండబోయిన వెంకటేశ్వర్లు, నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.

# నేటి జాబ్‌మేళా వాయిదా

కొత్తగూడెం టౌన్, జూన్ 28 : కొత్తగూడెంలో శనివారం జరగాల్సిన మెగా జాబ్‌మేళాను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీన కొత్తగూడెం క్లబ్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేళాలో పాల్గొనే నిరుద్యోగ యువతీ యువకులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, నేరుగా కూడా పాల్గొనవచ్చని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బయోడేటా తమ వెంట తీసుకొనిరావాలని సూచించారు.


